భారత న్యాయ వ్యవస్థ... క్రియాశీలత!

ప్రజాస్వామ్య వ్యవస్థ అనే ముక్కాలి పీటకు.. శాసన శాఖ, కార్యనిర్వాహక వర్గం, న్యాయశాఖలు మూడు కాళ్లు. వీటిలో ఏది బలహీనపడినా.. ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. శాసనశాఖ రూపొందించే చట్టాలు, కార్యనిర్వాహక వర్గం చేపట్టే చర్యలు పౌరస్వేచ్ఛకు భంగం కలిగిస్తే... రాజ్యాంగ నిబంధనలకు వైరుధ్యంగా ఉంటే... అవి చెల్లవని తీర్పు ఇచ్చే అధికారం సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉంది. దీనినే 'న్యాయసమీక్ష అధికారం' అంటారు!!



గోలక్‌నాథ్ కేసు (1967) విచారణ జరిపేంత వరకు సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుల సవరణతోసహా పార్లమెంటు చేసిన చట్టాలన్నింటికీ దాదాపు మద్దతునిచ్చింది. ఆస్తి హక్కును సవరించే అధికారం 368వ ప్రకరణ కింద పార్లమెంటుకు లేదని మెజారిటీ న్యాయమూర్తులు పై కేసులో అభిప్రాయపడ్డారు. అప్పటి నుంచి పార్లమెంటుకు, కార్య నిర్వాహక శాఖకు, న్యాయవ్యవస్థకు ఘర్షణ ప్రారంభమైందని చెప్పవచ్చు. ఇది పరోక్షంగా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం చేసింది. కేశవానంద భారతి కేసులో (1973)... ధర్మాసనం ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు, పార్లమెంటు అధికారాలపై పరిమితులు విధిస్తూ.. పరోక్షంగా న్యాయవ్యవస్థ పరిధిని విస్తృతం చేసింది. ఈ తీర్పులో వెలువరించిన రాజ్యాంగ మౌలిక స్వభావ సిద్ధాంతాన్ని తదుపరి కేసులలో ప్రస్తావిస్తూ... సుప్రీంకోర్టు ప్రభుత్వంలోని మిగిలిన రెండు శాఖల మీద తన ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి ప్రయత్నిస్తుందని విమర్శకుల అభిప్రాయం.

ఎమర్జెన్సీ సమయంలో న్యాయవ్యవస్థ కొన్ని పరిమితులకు లోనై వ్యవహరించినప్పటికీ.. 1978 తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని, క్రియాశీల ధోరణిని అవలంబిస్తుందని భారత రాజ్యాంగ నిపుణుల అంటున్నారు. జస్టిస్ పి.ఎన్. భగవతి, వి.ఆర్. కృష్ణయ్యర్ తదితరుల చొరవతో ప్రజాహిత వ్యాజ్యం (PIL) ఆవిర్భవించి భారతీయ పౌరులెవరైనా న్యాయార్థులు కావచ్చు అన్న స్ఫూర్తికి నిలువుటద్దం పట్టింది. తొలి రోజుల్లో ప్రజాహిత వ్యాజ్యం ఎంతో ప్రయోజనదాయకమైంది. ఎంతకీ కొలిక్కిరాని విచారణలో మగ్గిపోతున్న వేలమంది బీహారీ ఖైదీలకు విముక్తిని ప్రసాదించింది.. ఈ ప్రజాహిత వ్యాజ్యమే.

హవాలా డొంకను కదిపి, సతీష్ శర్మ పెట్రోలు బంకుల కేటాయింపుల దుర్వినియోగాన్ని బట్టబయలు చేసిందీ ఈ వ్యాజ్యమే. గంగానది కాలుష్య నివారణ, వాహన కాలుష్యం వల్ల ఢిల్లీ వాసుల జీవించే హక్కుకు భంగం కలిగిందంటూ.. ఒక పౌరుడు సుప్రీంకోర్టును ఆశ్రయించినపుడు డీజిల్ బస్సులను CNG బస్సులుగా మార్పించిన ఘనత సుప్రీం కోర్టుదే. అడవుల్లో చెట్లను విచక్షణా రహితంగా నరికివేయడాన్ని అడ్డుకుంది న్యాయవ్యవస్థే. కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ ఆదేశించడం.. ఢిల్లీ నగరంలో అక్రమ నిర్మాణాలను తొలగించడం.. బొమ్మై కేసులో 356వ ప్రకరణ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని సూచనలివ్వడం న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దర్పణం.

ఇవన్నీ ప్రభుత్వం నుంచి వ్యతిరేకతను, ప్రతిఘటనను ఎదుర్కొన్నవే. ఒకవైపు శాసనశాఖ, రెండో వైపు కార్యనిర్వాహక వర్గం క్రమేణా ప్రజా విశ్వాసాన్ని కోల్పోతుంటే... రాజ్యాంగ పరిరక్ష, పౌరస్వేచ్ఛ వ్యవస్థగా న్యాయశాఖ చొరవ తీసుకోవడం సహజమే. న్యాయ వ్యవస్థ క్రియాశీలత వల్ల ప్రాథమిక హక్కుల పరిధి విస్తృతమైంది. నివాస హక్కు, ఆరోగ్య హక్కు, జీవనోపాధి హక్కు, విద్యాహక్కు, స్వచ్ఛమైన పర్యావరణం, న్యాయ సహాయ హక్కు జీవించే హక్కులో భాగమని సుప్రీం కోర్టు నిర్వచించింది.

అలాగే స్వాతంత్ర్య హక్కులో విదేశాలకు వెళ్లే హక్కు, ఏకాంతపు హక్కు భాగమని.. పత్రికా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కులో భాగమని... సమాన వేతనం పొందే హక్కు, సమానత్వపు హక్కులో భాగమని తీర్పునిస్తూ... ప్రాథమిక హక్కులకు నూతన భాష్యాన్నిచ్చింది. రాజ్యాంగం లోని ఆదేశ సూత్రాలు కొంతమేరకు ప్రాథమిక హక్కుల హోదాను సంతరించుకోవడం కూడా (39వ ప్రకరణలోని (బి), (సి)లలో ప్రస్తావించిన ఆదేశ సూత్రాలకు 14, 19 ప్రకరణల్లో పేర్కొన్న ప్రాథమిక హక్కుల కంటే ఎక్కువ ప్రాధాన్యత) న్యాయవ్యవస్థ క్రియాశీలత వల్లే జరిగింది.అయితే, క్రియాశీలతనే నెపంతో న్యాయ వ్యవస్థ లక్ష్మణరేఖను దాటుతుందనే విమర్శ ఉంది. దీనికి చాలావరకు కారణం శాసనశాఖ, కార్యనిర్వాహక వర్గాల దుర్బలత. మండల్ వివాదం, రామ జన్మభూమి వివాదంలో కార్యనిర్వాహక వర్గం కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడానికి భయపడి.. వాటికి పరిష్కార మార్గాన్ని సూచించమని న్యాయవ్యవస్థను కోరడం.. హవాలా కేసులో సీబీఐ నిష్పక్ష పాతంగా వ్యవహరించడం లేదని న్యాయవ్యవస్థను జోక్యం చేసుకోవలసిందిగా ప్రతిపక్ష నాయకులు కోరడం.. తమిళనాడు

ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వాన్ని కావేరి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేయమని సుప్రీంకోర్టును కోరడం... ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాల ముసుగులో వ్యక్తులు, సంస్థలు, సుప్రీంకోర్టును మిగిలిన రెండు శాఖల కార్యకలాపాల్లో జోక్యం చేసుకోమని కోరడం... మొదలైనని న్యాయవ్యవస్థ క్రియాశీల తకు పురికొల్పాయి. ఈ నేపథ్యంలో.. కొన్ని సందర్భాల్లో న్యాయ వ్యవస్థ అతిగా స్పందించిన సంఘటనలు కూడా ఉన్నాయి.

కావేరి నదీజలాల సమస్యను చర్చించడానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించడం న్యాయ వ్యవస్థ క్రియాశీలతలో ఒక కొత్త కోణం. రోజురోజుకు శాసనశాఖ కార్యనిర్వాహక శాఖల పనిలో పెరుగుతున్న న్యాయ వ్యవస్థ జోక్యాన్ని దృష్టిలో పెట్టుకొని... విమర్శకులు ''న్యాయ వ్యవస్థ తో నడుస్తున్న ప్రభుత్వం'' అని వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల కాలం లో ''సభ్యులు డబ్బు తీసుకొని పార్లమెంటులో ప్రశ్నలు వేయడం'' కేసులో సుప్రీంకోర్టు స్పందించిన తీరు.. తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చిన బిల్లులు న్యాయ సమీక్ష పరిధిలోకి వస్తాయని తీర్పునివ్వడం... లాంటి సంఘటనలు శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థల మధ్య ఘర్షణకు దారి తీసేవిగా ఉన్నాయి.

జార్ఖండ్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడు గవర్నరు తీసు కున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ... సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై... లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ చటర్జీ ''శాసనసభ అంతర్గత కార్యకలా పాలలో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకొన జాలదు'' అని అభిప్రాయ పడ్డారు. రోడ్లు, వంతెనలు నిర్మిం చాలని ప్రభుత్వానికి ఆదేశాలివ్వ డం.. రైళ్ల రాకపోకలకు సరైన వేళల పట్టిక రూపొందించాలనడం.. విద్యాసంస్థలలో అడ్మిషన్లు ఎలా జరపాలో నిర్దేశించడం.. లాంటి ఉత్తర్వులు న్యాయవ్యవస్థ మితిమీరిన జోక్యాన్ని నిర్ధారిస్తాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఏ.కె.మాధుర్, మార్కండేయ కట్జూ.. ఇటీవల కాలంలో ప్రతిపాదించిన ''న్యాయవ్యవస్థ సహేతు కత'' (Judicial reasonableness) హద్దులు దాటుతున్న క్రియాశీలతను పరిమితం చేయడమే ననవచ్చు. కోర్టు ధిక్కారణ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయనే విమర్శ కూడా విన్పి స్తోంది. తరచుగా ఈ అధికారాన్ని వినియోగించడం ఆరోగ్యకర మైన సంకేతం కాదు.. అని న్యాయమూర్తి హెచ్.ఆర్.ఖన్నా అభిప్రాయప డ్డారు. న్యాయమూర్తి సభర్వాల్.. తన తనయులకు, ఆశ్రితులకు మేలు కలిగే విధంగా తీర్పు ఇచ్చారంటూ... ''మిడ్ డే'' పత్రికలో వెలువడిన కథనంపై ఢిల్లీ హైకోర్టు స్పందించిన తీరు మేధో సమాజం అంతా నిరసన వెలిబుచ్చడానికి దారి తీసింది. తాము ప్రచురించినదంతా వాస్తవమేనని.. అందుకు ఆధారాలున్నాయని పత్రిక యాజమాన్యం చేసిన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ప్రస్తుత భారత ప్రధాన న్యాయ మూర్తి కె.జి.బాలక్రిష్ణన్ ''తన కార్యాలయం సమాచార హక్కు చట్టపరిధిలోకి రాదు'' అని అభిప్రాయపడడం... మేధో సమాజాన్ని ఒకింత కలవరపెట్టింది.

ప్రపంచంలో ఎక్కడా కూడా న్యాయమూర్తులను న్యాయవ్యవస్థే నియమించడం లేదు. అది కార్యనిర్వాహక వర్గం బాధ్యత. ఆర్టికల్ 74 ప్రకారం రాష్ట్రపతి మంత్రిమండలి సలహామేరకు నియామకాలన్నీ జరుపుతారు. అయితే సుప్రీంకోర్టు.. న్యాయవాదుల కేసు సందర్భం లో తీర్పునిస్తూ.. న్యాయమూర్తుల నియామకంలో భారత ప్రధాన న్యాయమూర్తి, మరి ఇతర సీనియర్ న్యాయమూర్తుల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్ర పతికి, మంత్రిమండలికి న్యాయమూర్తుల నియామకంలో తగిన పాత్ర లేదనే చెప్పాలి. ఈ పరిణామం కూడా న్యాయవ్యవస్థ క్రియాశీ లతకు దోహదం చేసిందని చెప్పవచ్చు.

అన్ని రకాలైన నియంతృత్వాలలో న్యాయవ్యవస్థ నియంతృత్వం క్షమించరానిది. రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిన వ్యవస్థే తన హద్దుల ను అతిక్రమిస్తే... కంచే చేను మేసినట్లు అవుతుంది. చట్టాలు రూపొం దించాల్సిన బాధ్యత ప్రజాప్రతి నిధులది. వాటిని అమలు చేసే విధి కార్యనిర్వహణ వర్గానిది. న్యాయవ్యవస్థ తన పరిధిని గుర్తించి, తదను గుణంగా వ్యవహ రిస్తేనే.. సగటు పౌరుని స్వేచ్ఛకు రక్షణ ఉంటుంది. అలాంటి వాతావరణాన్ని కల్పించడానికి పౌరసమాజం నడుం కట్టాలి!!